క్లుప్తంగా

మందుబాబులకు కౌన్సెలింగ్

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంలో బుధవారం రాత్రి బహిరంగంగా మద్యం సేవిస్తున్న సుమారు 20 మంది యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి వివాదాలు సృష్టిస్తే సహించేది లేదని ఎస్ఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. మరలా ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేసిన వలంటీర్

మంగళగిరి: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి వలంటీర్ ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. నగర పరిధిలోని పెదవడ్లపూడి సచివాలయం-2 పరిధిలో నివాసముంటున్న బడేపూడి సుబ్బారావుకి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ అందజేస్తుంది. సుబ్బారావు గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని కృష్ణా జిల్లా రామవరప్పాడులోని అను న్యూరో కార్డియాక్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వలంటీర్ మన్నెం అనిల్‌కుమార్ గురువారం పెదవడ్లపూడి నుంచి రామవరప్పాడులోని ఆసుపత్రికి వెళ్లి సుబ్బారావుకు పెన్షన్ అందజేశాడు. సుబ్బారావు కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేసి అనిల్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేయగా అధికారులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని ఫీడర్ మరమ్మతులు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం ద్వారకానగర్, ఏపీ ఎస్పీ క్యాంప్ రోడ్, ఎల్‌బీ నగర్, ఇందిరానగర్, గణపతినగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



తాడికొండ: తాడికొండలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం వ్యాధుల సీజన్ ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు సర్పంచ్ తోకల సరోజినీ, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి కాలువలు పూడికతీత తీయించడంతోపాటు దోమల మందు, గడ్డి మందును పిచికారీ చేసి నీటి నిల్వలు లేకుండా తొలగిస్తున్నట్లు తెలిపారు. గురువారం గ్రామంలోని మురుగు బయటకు వెళ్లే నక్కవాగు ప్రధాన డ్రెయిన్ పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు హర్షణీయం

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని కేబినెట్ సమావేశంలో తీర్మానించడంపై పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జాతీయ పసుపుబోర్డు ఏర్పాటు చేయడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడం, క్వింటా పసుపునకు మద్దతు ధర రూ.10 వేలు ప్రకటించాలని, నేలల స్వభావాన్ని బట్టి శాస్త్రీయ పరిశోధనలు చేసి కుర్కుమిన్ శాతం అధికంగా ఉండే పసుపు విత్తనాలను ఉచితంగా అందజేయాలని కోరారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు గురువారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 25 ఏళ్ల వయసున్న యువకుడు మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రైలు నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అతిథి అధ్యాపకుల నియామకం

గుంటూరుఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు స్టాటిస్టిక్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థులు ఈనెల 10లోపు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో 55 శాతం కంటే ఎక్కువ మార్కులున్న వారు అర్హులని, పీజీతోపాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు గల అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష...అందరికీ రక్ష

- పలుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు
- వైద్య పరీక్షలు..ఉచితంగా మందులు పంపిణీ
- ప్రజల నుంచి విస్తృత స్పందన



గొడవర్రులో సురక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నారని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. దుగ్గిరాల మండలం గొడవర్రులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఏర్పాటు చేసి ఈమని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. క్యాంపును ప్రారంభించిన వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లోని వృద్ధులకు, మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఎంతోమంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్ఎంపీ దగ్గరకు వెళ్లి కాలం వెళ్లబుచ్చుతున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పల్లెలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఇంటింటికి ప్రభుత్వ వైద్యులను పంపి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వైద్యం అందజేస్తున్నారని, డాక్టర్లు ఇంటింటికి తిరిగే సమయంలో ఎంతోమందికి సమస్యలు బయటపడ్డాయని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు స్పెషలిస్ట్ డాక్టర్లను పిలిపించి ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. శిబిరంలో పరిష్కారంకాని రోగాలకు ఆరోగ్యశ్రీ వర్తించే ఆసుపత్రులకు పంపించి మెరుగైన వైద్యం అందజేస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఈవోపీఆర్డీ పి.శ్రీనివాసరావు, సర్పంచ్ విశ్వనాథపల్లి ఉమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీకాంత్, వైద్యులు ప్రభాకర్, శివ, కె.తాజుద్దీన్, ఇందిర, సుకన్య, వి.వి.కర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వాణి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: రాష్ట్రంలో పండుగ వాతావరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతోందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మేడికొండూరు మండలం విశదల గ్రామంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సదుపాయాలు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసశర్మ, ఎంపీడీవో ప్రభాకరరావు, మతనంపల్లి శాంతయ్య, పి.వెంకటకృష్ణయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: రాష్ట్రంలో సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్‌పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలోని ప్రజలను సురేష్‌కుమార్ పలకరించి వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. ఓపీ కౌంటర్ వద్ద, వైద్యపరీక్షలు చేసే ప్రాంతంలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని చెప్పారు. 62 మంది విద్యార్థులు కంటిపరీక్షలు చేయించుకోగా వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, మార్పుల శివరామిరెడ్డి, ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్, డీఐవో సుబ్బరాయన్, కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, మేడా బాబు, జి.చంద్రం, పి.రఘు, సుధాకరరెడ్డి, రామమోహన్‌రెడ్డి, పి.చిన్న, వైద్యులు పి.ఎస్తేరురాణి, ఫరీనాబేగం, యానీగ్రేస్, బ్యూలా, మేఘన, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, సిస్టర్ ఒట్టి థెరసమ్మ, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగనన్న లక్ష్యం

రావెల(తాడికొండ): ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోరిక అని అందుకోసం జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన జగనన్న ప్రతి పేదవాడి ఇంటికే వైద్యసేవలు అందిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం తాడికొండ మండలం రావెల గ్రామంలో కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో నిత్యం మానసిక ఆందోళనతో ముందుకెళుతున్న మానవ జీవితం అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న పరిస్థితి ఉందని, చిన్నపాటి సమస్యలు ముందుగానే గుర్తించడం ద్వారా పెద్ద పెద్ద అనర్థాలు జరగకుండా కట్టడి చేయవచ్చన్నారు. కార్పొరేట్ వైద్యం కట్టలు తెంచుకొని పేదవాడికి అందనంత ఎత్తుకు ఎదిగిన ఈ రోజుల్లో పేదవాడికి పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు రోగులకు అందజేస్తున్న జగనన్నకు జనం నీరాజనాలు పలుకుతున్నారన్నారు. రోగులకు ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన కిట్‌లను అందించిన ఆయన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావెల శైలజ, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, ఈవోఆర్డీ వెంకటేశ్వర్లు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



విశదల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కత్తెర సురేష్‌కుమార్

నృసింహుని స్థలంలో ఆక్రమణల తొలగింపు

- అడ్డుకునేందుకు యత్నించిన ఆక్రమణదారులు
- పోలీసుల రక్షణలో ఆక్రమణలు తొలగించిన అధికారులు
- రూ.3కోట్ల విలువైన స్థలం స్వాధీనం చేసుకున్న అధికారులు



ఆక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న దృశ్యం

మంగళగిరి: నగరంలో వేంచేసివున్న లక్ష్మీనసింహస్వామి ఆలయానికి చెందిన స్థలంలో అక్రమ కట్టడాన్ని అధికారులు తొలగించారు. అక్రమ కట్టడాన్ని తొలగించి రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయ ధూప దీప, నైవేద్యాలకు పట్టణానికి చెందిన నంబూరు వెంకటప్పయ్య సర్వే నెంబర్‌లోని 233లో 351 చదరపు గజాల స్థలాన్ని 1890 సంవత్సరంలో దానంగా ఇచ్చారు. అప్పటి అధికారులు పట్టించుకోకపోవడంతో సుమారు 50 సంవత్సరాల క్రితం స్థానికంగా నివాసముంటున్న జంజనం వెంకటేశ్వరరావు ఆక్రమించుకుని వినియోగించుకుంటున్నారు. రెండు నెలల కిందట స్థలం ఆలయానిది అని గుర్తించిన అధికారులు ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారుడు ఖాళీ చేయకపోగా స్థలం ఎన్నో సంవత్సరాలుగా తన ఆధీనంలో ఉందని, తమదేనంటూ శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి మొదటి అంతస్తు శ్లాబు నిర్మాణం చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసి గురువారం ఉదయం అక్రమ కట్టడాన్ని తొలగించేందుకు సన్నద్ధం కాగా అడ్డుకునేందుకు ఆక్రమణదారుడి కుటుంబసభ్యులు తీవ్ర యత్నం చేశారు. చట్టప్రకారం అక్రమ కట్టడాన్ని తొలగించిన అధికారులు సుమారు రూ.మూడు కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ కట్టడాల తొలగింపు ఏసీ బొంతు మహేశ్వరరెడ్డి, కాజ గ్రూపు ఆలయాల ఈవో వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి గురువారం వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెరసురేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మట్టిరోడ్లతో ప్రజలు ఇబ్బంది పడకుండా సీసీ రోడ్డు నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షలు కేటాయించారని ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ డి.మెల్కియా, వైస్ ఎంపీపీ జి.చంద్రం, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, పాలపాటి రఘు, జి.వెంకటేష్, మేడా బాబు, ఎస్.చిన్నప్ప, జి.సంగీతరావు, ఆనంద్, సీహెచ్ లూర్దురాజు, డి.లూర్దయ్య, కె.శౌరీలు, నాని, చంద్రపాల్, గోపి,డేవిడ్, ఎం.సుధాకరరెడ్డి, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, ఖాజావలి, కె.రామారావు, పి.చిన్న, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

నేడు డోలాస్‌నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష

ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి ప్రతి సచివాలయ పరిధిలో వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి అన్నారు. డోలాస్‌నగర్ డ్రైవర్స్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్షపై గురువారం శివారెడ్డి హెల్త్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించుకునేందుకు, వైద్యసేవలు అందుకునేందుకు సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది వరకు హాజరుకానున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేషన్ తరుపున అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని, వైద్యపరీక్షలు నిర్వహించేందుకు వేర్వేరు శిబిరాలు నిర్వహిస్తారని, ఏ విభాగానికి ఆ విభాగంలో పరీక్షలు నిర్వహించే విధంగా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాసరావు, డాక్టర్ మానస, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, ఆశా వర్కర్లు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో ఇరువురి మధ్య ఘర్షణ

- ఒక వ్యక్తిపై కొడవలితో దాడి
- తీవ్రంగా గాయాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో ఓ ఫంక్షన్ ఏర్పాట్లు జరుగుతుండగా ఇరువురి మధ్య ఘర్షణ ఏర్పడగా ఓ వ్యక్తిపై కొడవలితో దాడిచేసి గాయపరిచిన సంఘటనపై తాడేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పెనుమాకకు చెందిన బొప్పన రమేష్‌కు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఘర్షణ జరుగుతుండగా దండమూడి ఉమామహేశ్వరరావు ఇది గొడవ పడే సమయం కాదు అంటూ ఇరువురిని విడదీశాడు. ఈ సమయంలో ఆగ్రహం వ్యక్తం చేసి బొప్పన రమేష్ పక్కనే ఉన్న కొడవలితో ఉమామహేశ్వరరావుపై దాడిచేశాడు. దాడిలో ఉమామహేశ్వరరావుకు కంటి కింద, చెవి వెనుకభాగంలో తీవ్ర గాయమైందని, ఇతను తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దాడిచేసిన బొప్పన రమేష్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్నకే పట్టం కట్టండి

మేడికొండూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి జరగాలంటే తిరిగి జగనన్నకే పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల జంక్షన్‌లో గల సాయికృష్ణ కల్యాణ మండపంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు. నవరత్నాలు ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో జగనన్న ఒక ఆదర్శ వంతుడైన నాయకుడుగా మిగిలిపోయారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పలు పథకాలు ప్రవేశపెట్టి నాయకులు జేబులు నింపుకున్నారే తప్ప పేద ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. పేద ప్రజలకే కాకుండా మధ్య తరగతి ప్రజలకు కూడా వైద్య పరంగా ఎటువంటి నగదు చెల్లించకుండా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ దొంగల ముఠా చేస్తున్న వికృత చేష్టాలు ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, ఎంపీటీసీలు మదమంచి శ్రీను, పల్లపు శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షుడు సుభాని, ముత్యాల బాలస్వామి, కోకా అర్జున్‌రావు, ఉడతా శ్రీనువాసరావు, తుమాటి మురళీ, షేక్ షరీఫ్, గండికోట రసూల్, అల్లు శ్రీనివాసరెడ్డి, షేక్ రబ్బాని, గోపిదేశి శ్రీను, లూర్థురాజు, కిషోర్ రెడ్డి, చాపరాల కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాతగుంటూరు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని కూల్‌డ్రింక్స్, బేకరీ దుకాణాల్లో ఆహార పదార్థాల్ని అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఏటీఎం సత్యనారాయణ వ్యాపారులకు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం బస్టాండ్‌లోని పలు దుకాణాల్ని ఆయన తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న నాలుగు దుకాణదారులకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఇకపై అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు.

పాస్‌బుక్ పోయినది

తాతినేని శోభారాణి భర్త శ్రీమన్నారాయణ, డోర్ నెం: 1-23, చినవడ్లపూడి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లాకు చెందిన నా యొక్క ఒరిజినల్ పాస్ బుక్ (నెంబరు : 94, సర్వే నెంబరు : 89-సి1) ది.19-09-2023 మంగళవారం మంగళగిరి బస్టాండు సమీపంలో పోయినది. సమీపంలో ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికినచో తెలుపవలెను. సెల్ నెం: 9700922460

సాంకేతిక విప్లవ వ్యాప్తిలో కాట్రగడ్డ పాత్ర కీలకం

నివాళులర్పించిన నేతలు



కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తాడేపల్లిరూరల్: కాట్రగడ్డ ఫౌండేషన్ ద్వారా లక్ష్మీ నరసింహారావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, రాష్ట్రంలో రెండు దశాబ్దాల కిందటే సాంకేతిక విప్లవాన్ని వ్యాప్తిచేయడంలో కీలక పాత్ర పోషించారని పలువురు నాయకులు పేర్కొన్నారు. దుగ్గిరాల మండలం చిలువూరులో గురువారం కాట్రగడ్డ లక్ష్మీ నరసింహారావు సంస్మరణసభ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, బాల్యమిత్రులు కాట్రగడ్డ లక్ష్మీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిలువూరు గ్రామాన్ని రాజీవ్ ఇంటర్నెట్ విలేజ్‌గా రూపొందించి సాంకేతిక విప్లవాన్ని విస్తృత పరిచారని, జన్మభూమి స్ఫూర్తితో రహదారులు నిర్మించడం, సోలార్ లైట్లు పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు యోగ అవగాహన శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, మాజీ ఎమ్మెల్సీలు నన్నపనేని రాజకుమారి, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ, అబ్బూరి మల్లికార్జునరావు, ఎన్ఆర్ఐలు సతీష్ వేమన, గుత్తికొండ శ్రీనివాస్, బాల్యమిత్రులు మండల వెంకట రామయ్య, సామినేని కోటేశ్వరరావు, రంగిశెట్టి రమేష్, విశ్రాంత మున్సిపల్ కమిషనర్ దేవినేని కరుణ చంద్రబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యడ్ల వెంకటరావు, ఎంపీటీసీలు జమీన్ సాధిక్, చిలువూరు మరియ, రోజమ్మ, యేసుపాదం, ఇందుపల్లి బాల, పినపాటి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి ప్రసాదం సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



తెనాలి: కలియుగంలో ధానధర్మాలు, నామస్మరణతోనే దేవుడిని ఆరాధించేందుకు ఆచరించాల్సిన ధర్మమని శ్రీకృష్ణ భగవానుడు ఏనాడో చెప్పారని, మన శాస్త్రాలు కూడా ఇదే చెబుతున్నాయని శ్రీసాయి ప్రసాదం సేవా సమితి వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను గురువారం చినరావూరు డొంక రోడ్డులోని మారుతి ఆలయంలో ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలోని 125 మందికి అన్నదానం చేశారు. పండగలు, పుట్టిన రోజులను పేదలతో జరుపుకుంటే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని చెప్పారు. జలుబుల తేజేష్ జన్మదినం సందర్భంగా జరిగిన ఈ వితరణలో విశ్రాంత ప్రభుత్వ అధికారి రమణయ్య, సురేష్, వెంకయ్య, దేవాలయ ధర్మకర్త దేశయ్య పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ మన కర్తవ్యం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్‌బాబు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేటలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ ముఠా కార్మికులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గురువారం బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలలను రక్షించాలని, ప్రతినిత్యం వారికి రక్షణగా ఉండాలని, బాలలంటే 18 సంవత్సరాలలోపు వయస్సు గలవారని, బాలల అభిప్రాయాలను గౌరవించాలని, వారి మాటలకు విలువ ఇవ్వాలని వివరించారు. బాలలను తిట్టడం, కొట్టడం, మానసికంగా వేధించడం వలన వారు మానసిక కృంగుబాటుకు గురౌతారని, ఇది వారి జీవితంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని, మానవ హక్కులన్నీ పిల్లలకు కూడా వర్తిస్తాయని, బాలల హక్కుల రక్షణ మన అందరి కర్తవ్యం అన్నారు. బాలల ముందు మందు తాగడం, సిగరెట్ కాల్చడం, మత్తు పదార్థాలు తీసుకుంటే వారు కూడా ఆకర్షితులవుతారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారిని డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, ఈ చికిత్సను అందించేందుకు డాన్‌బాస్కో డీ ఎడిక్షన్ సెంటర్ నూజివీడులో ఏర్పాటు చేశామని వివరాలకు 9490492020ను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, నులకపేట గిడ్డంగుల సంస్థ ముఠా మేస్త్రి మల్లాబత్తిన చెన్నయ్య, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వసంతనగర్‌కు చెందిన ఎం.కిషోర్ గుంటూరు కొత్తపేట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. కిషోర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో గాలిలోకి మూడుసార్లు కాల్పులు జరిపి గురువారం వసంతనగర్‌లోని బరియల్‌గ్రౌండ్‌లో అంత్యక్రియలు జరిపారు. ఏఆర్ ఎస్సై వెంకటేశ్వర్లు, కొత్తపేట సీఐ అన్వర్‌బాషాలు వచ్చి కిషోర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎస్సైలు మొహమ్మద్ మిరజ్, ఫిరంగిపురం ఎస్సై కిషోర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే బూత్‌లో చేర్చాలి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా జాబితాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలను నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి ఆదేశించారు. తన చాంబర్‌లో గురువారం ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజరీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో వారు అందించిన ఫిర్యాదుల్ని సూపర్‌వైజర్లు పరిశీలించి, సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో అందిన ఫారాల్ని అదనపు కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్ చేశామని చెప్పారు. పెండింగ్ ఫారాల ఆన్‌లైన్‌పై బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు



తెనాలి అర్బన్: ఐటీఐ చదవడం వల్ల జీవనోపాధి త్వరగా దొరుకుతుందని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావిచిన వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్ధార్థ ఐటీఐ వార్షికోత్సవ వేడుకల్ని అయితానగర్‌లోని కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవుల రాజేంద్ర ప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

